# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీతో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.
- ❖ తల్లికి వందనం పథకానికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 112వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గత ప్రభుత్వ హయంలో అబ్కారీ శాఖలో జరిగిన అవకతవకలపై శాసన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శ్వేతపత్రం విడుదల చేశారు. మద్యపాన నిషేధం, లిక్కర్ ఔట్‌లెట్స్‌ని తగ్గించామని చెప్పి మద్యం ధరలు పెంచారన్నారు. ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో డబ్బును తీసుకొచ్చి ఆబ్కారీ శాఖలో పెట్టుబడులు పెట్టించారని, దీంతో ఆయా శాఖలకు దాదాపు 250 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ జరిపిస్తామని, ఆబ్కారీ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డీఅడిక్షన్ సెంటర్లనూ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి పేర్కొంటూ ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. లోక్ సభలో ఈరోజు పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని, సీఎం రమేష్ అడిగిన ప్రశ్నలకు రైల్వేమంత్రి సమాధానమిస్తూ...

2023-24 ఏడాదికి రాష్ట్రానికి 8 వేల 406 కోట్ల రూపాయలు విడుదల చేశామని పేర్కొన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తునామని, అమరావతిలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు నిధులు కేటాయించామని తెలిపారు. విజయవాడ స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, అలాగే అనకాపల్లి స్టేషన్ గురించి వివరాలు నివేదిక రూపంలో ఇస్తానని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

“తల్లికి వందనం” పథకానికి సంబందించిన విధివిధానాలను రూపొందిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసన మండలిలో ఈరోజు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో 72 వేల మంది విద్యార్థులు తగ్గారని, ఇతర రాష్ట్రాల్లోని మంచి విధానాలపై అధ్యయనం చేస్తామని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యాశాఖలో మంచి విధానాలను అమలు చేస్తామని మంత్రి నారా లోకేష్ తెలియజేసారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మద్యపాన విధానానికి సంబంధించి లోతైన విచారణ జరగాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ రోజు శాసనసభ సమావేశంలో అబ్కారీ శాఖపై విడుదల చేసిన శ్వేతపత్రంపై మాట్లాడుతూ... రాష్ట్రంలో కొన్ని వేల కోట్ల రూపాయలు మద్యపానానికి సంబంధించి అవినీతి జరిగిందన్నారు. తప్పుచేసిన వారికి శిక్ష తప్పదని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ.....

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు శాసన సభను సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలతో ప్రారంభించారు. విశాఖపట్నంలో కాలుష్య నియంత్రణ, రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారులు, కేజీహెచ్ లో సిబ్బంది కొరత, గ్యాస్ సిలిండర్ల ఉచిత పంపిణీ, ధాన్యం రైతుల సమస్యలు, టెంపుల్ టూరిజం, మత్స్యకారులకు సంబంధించిన జీవో నెంబర్ 217, ఇసుక తవ్వకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆంధ్ర ప్రదేశ్ మ్యారీటైమ్ టైం బోర్డు ద్వారా కృష్ణపట్టణం పోర్టు లీజు వంటి పలు ప్రశ్నలను లేవనెత్తిన సభ్యులకు సంబంధిత మంత్రులు సమాదానాలను ఇవ్వడం జరిగింది. ఇదిలా ఉండగా రేపు శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

గోదావరి నది వరద నీటి ప్రవాహం పెరుగుతున్న నేపధ్యంలో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. 14.56 లక్షల క్యూసెక్కులు నీటిని సముద్రంలోకి అధికారులు విడుదల చేశారు. తూర్పుగోదావరి

జిల్లాలోని సీతానగరం మండలంలో ఏటిగట్టు ప్రమాదకరంగా మారింది. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోకి వరద నీటి ప్రవాహం చేరింది. గోదావరి వరద ప్రభావంతో కోనసీమలోని లంక గ్రామాలు నీటమునిగాయి. కొత్తపేట, మండపేట, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం, రామచంద్రపురం నియోజకవర్గాల్లో గ్రామాల్లోకి వరదనీరు చేరింది. ఈ వరదల కారణంగా డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే సుమారు వెయ్యి హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈ రోజు విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఈరోజు భక్తుల రద్దీ సాధారణంగా నెలకొంది. ఉచిత సర్వ దర్శనానికి 10 కంపార్ట్ మెంట్లలో భక్తులు వేచి వున్నారు. టోకెన్ లేని భక్తులకు వేంకటేశ్వర స్వామి వారి సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతోందని ఆలయ అధికారులు వెల్లడించారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు సుప్రభాత సేవ మినహా మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశామని టీటీడీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కు ప్రాధాన్యత ఇవ్వడం కూటమి ప్రభుత్వ విజయానికి సంకేతమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంలో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందని, దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రానికి ప్రకృతి వ్యవసాయానికి గుల్బెంకియన్ అవార్డు రావడం జరిగిందని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేయడం రైతాంగానికి సువర్ణ అవకాశమని తెలిపారు. నవ్యాంధ్రలో ప్రకృతి సేద్యాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుని, స్వచ్ఛమైన ఉత్పత్తుల ఎగుమతులు వృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కొన్ని చోట్ల కురిసే అవకాశముందని, భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం వుందని వాతావరణ అధికారి పేర్కొంటూ......

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ గోదావరి జిల్లాలో వరదల కారణంగా పంటనష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఋణ మాఫీనీ అందజేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్. షర్మిల డిమాండ్ చేసారు. ఈరోజు పశ్చిమగోదావరి జిల్లా నందమూరు గ్రామంలో యర్రకాలువ వరద నీటిలో మునిగిపోయిన పంట పొలాలను ఆమె పరిశీలించి, రైతులను నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులను ఆదుకోవాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు వస్త్ర సంచుల వినియోగం చాలా అవసరమని మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ నగర ప్రజలకు ఉచితంగా అందించేందుకు స్వచ్ఛ సర్వేక్షన్ 2024 “ఎకో వైజాగ్” పేరున తయారు చేయించిన 30 వేల వస్త్ర సంచులను కమిషనర్ ఆయన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... నగర పరిరక్షణకు, పరిశుభ్రతకు,

నగరాభివృద్ధికి ప్రజలను చైతన్య పరుస్తూ వారి అవగాహన కొరకు కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత ఎంతో దోహదపడుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ - 2024లో విశాఖ నగరం దేశంలోనే ప్రథమ స్థానం సాధించే దిశగా జీవీఎంసీ యంత్రాంగం కృషి చేస్తుందని పి.సంపత్ కుమార్ అన్నారు.

=======================

విశాఖ జిల్లాలో వచ్చే ఏడాది మార్చి నాటికి 10 వేల మంది యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు.

=======================
=======================